www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబర్ 2022

5

తూర్పుగోదావరి



కరాటేలో కడియం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడియం

కడియం జపాన్ ఫోటోకాన్ కరాటే పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర కరాటే టోర్నమెంట్‌లో పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ కె.జానకి రాముడు తెలిపారు. కె.లోకేష్, యు.వీరసాయి, బి.కుమార్ రాజా, జి.సాయి సన్నివిత, ఆర్.ఆదిత్య, సిహెచ్.చైతన్య సాయికి మొదటి స్థానం లభించగా, జి.సోహన్, ఐ.నవీన్ కుమార్, జి.రాజేష్, జె.వెంకట ఆదిత్య, ఎం.హర్ష కరుణ, ఎస్.వర్ధన్‌కు ద్వితీయ స్థానం సాధించినట్లు కోచ్ తెలిపారు. వీరిని గిరజాల బాబు, గ్రాండ్ మాస్టర్ కె.నాగిరెడ్డి, అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-చాగల్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలో విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నట్లు హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి తానేటి వనిత ఊనగట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతులు కల్పించి ఆధునికీకరిస్తామన్నారు. జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా మంచి కార్యాచరణతో ముందు కెళుతున్నామన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేసి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. విద్యారంగంపై ముఖ్యమంత్రి జగన్మోహ న్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని దీనిలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే విధంగా సిబిఎస్ఇ సిలబస్‌తో బోధన అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండాలనేది ప్రభుత్వ లక్ష్య మన్నారు. అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాదీ విద్యార్థుల తల్లులకు ఖాతాల్లో రూ.15 వేలు జమ చేస్తున్నామన్నారు. నాయకులు, అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించి, ప్రజలు సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించి కష్టకాలంలో వారిని ఆదుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట వెంకట్రావు, వైస్ ఎంపిపి రామచంద్రరావు, ఎ.దొరయ్య, గూడపాటి శివ ఆకుకూరి, గోపీచంద్, బండి అబ్బులు, ముదునూరు నాగరాజు, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, తోట రామకృష్ణ గౌడ్, తాత కృష్ణారావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి వనిత

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజానగరం, గోకవరం

ఉపాధ్యాయులు ఎదుర్కొటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎంఎల్‌సి ఐవి వెంకటేశ్వరావు అన్నారు. మండలంలో వెలుగుబంద ఎంపియుపి స్కూల్‌ను ఆయన శనివారం సందర్శించారు. ప్రభుత్వం ఫార్మేటివ్-2 పరీక్షల విద్యా విధానం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనివల్ల ముందుగా ప్రశ్నపత్రాలు ముబైల్ వాట్సాప్‌లో విద్యా శాఖధికారులు పంపుతున్నారన్నారు. దీనిని ఉపాధ్యాయులు బోర్డ్‌పై రాసి దీనిని చూసి విద్యార్థులు పరీక్షలు రాస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రశ్నపత్రాలు ముద్రించి పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట యుటిఎఫ్ మండల అధ్యక్షుడు సిహెచ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌వివి తాతారావు తదితరులు ఉన్నారు.

ఫార్మాటివ్ పరీక్షల ప్రశ్న పత్రాలను పాఠశాలలకు సరఫరా చేయాలని యుటిఎఫ్ గోకవరం మండలం అధ్యక్షుడు ఎస్.అనిల్‌కుమార్, కార్యదర్శి కెజశ్రీనివాసులు కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి వెంకటేశ్వరావు

ఆన్‌లైన్ ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ధాన్యం కొనుగోలులో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ పద్ధతిలో పారదర్శకంగా కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. శనివారం సత్యవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తొలుత గ్రామంలో ఇందుకూరి సుబ్బరాజు జెడ్‌పి హైస్కూల్లో నిర్వహిస్తున్న మన బడి నాడు-నేడు పనులను పరిశీలించారు. స్కూల్ ఆవరణలో చేపడుతున్న ఫ్లోరింగ్ పనులకు సంబంధించి తగిన సూచనలు చేశారు. ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పనుల తీరును, పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బికె ధాన్యం కొనుగోలు కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం అన్నారు. ధాన్యం సేకరణ సందర్భాల్లో తేమ శాతం నిర్ధారణ పరీక్షల ఫలితాలను అనుసరించి, మిల్లర్ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో గోనె సంచుల ఇబ్బందులు లేకుండా రొటేషన్ పద్ధతిలో ధాన్యం సేకరించి మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో రోడ్డు ఆక్రమణలను తొలగించి, రోడ్ల నిర్మాణానికి అనువుగా కొలిపించమని స్పందనలో ఫిర్యాదు చేసినట్టు కలెక్టర్‌కు తెలిపారు. తహశీల్దార్ జి.కనకరాజు సైతం సర్పంచ్ కోరిట్లుగా కొలిపించే ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పర్యటన హౌసింగ్ డిహెచ్ఒ బి.తారాచంద్, హౌసింగ్, వ్యవసాయ, విద్యా శాఖ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గోదావరి పరిరక్షణ అందరి బాధ్యతని గుడా మాజీ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. గోదావరి జలాల పరిరక్షణ కోరుతూ టికె విశ్వేశ్వర్ రెడ్డి చేపట్టిన పోరాటానికి గన్ని కృష్ణ సంఘీభావం తెలిపారు. పుష్కరాల రేవు వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి గన్ని కృష్ణ వెళ్లి టికెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ గోదావరిని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవాలని, ప్రజలకు తాగునీటిని సాగునీటిని అందిస్తున్న పుణ్య గోదావరి కలుషితం కాకుండా అందరూ కృషి చేయాలన్నారు. ఈ విషయంలో విశ్వేశ్వర్ రెడ్డి దీక్ష చేయడం అభినందనీయమని గన్ని పేర్కొన్నారు.

లక్ష్మణరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని దొండపూడికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గుర్రం లక్ష్మణరావు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి నాయకులు ముత్యాల రాయుడు అన్నారు. శనివారం దొండపూడిలోని లక్ష్మణరావు మృతదేహానికి ఆయన నివాళుర్పించారు. పార్టీ నాయకులు బండారు గన్నిరాజు, లక్ష్మణరావు ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి జయశివసూర్యం, షేక్ మాబు, మస్తాన్, రౌతు సతీష్, ముప్పిడి అనిల్, చాపల శేఖర్, చందా శ్రీను, గోపాలం, పిల్లి కడలియ్య, సంసాని గంగరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో జెసి తేజ్‌భరత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రైతులతో సంభాషించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సీతానగరం, కోరుకొండ, గోకవరం మండలాల్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని, ఈ నేపథ్యంలో రైతుల నుంచి సమాచారం తెలుసుకుని క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని అధికారులతో వచ్చినట్టు తెలిపారు. కష్టపడి పని చేసే రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం సేకరణ ప్రక్రియలో నూతన మార్గదర్శకాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. నూతన విధానంలో కొన్ని సమస్యలు ఎదురవ్వడం సహజమని, వాటికి నేరుగా రైతులతో మాట్లాడి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. గన్నీ బ్యాగ్స్ కోసం గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్‌బికెకు రైతు ఎంత ధాన్యం తీసుకుని వస్తారో అంచనా వెయ్యడం వల్ల 24 గంటల ముందే ఆ మేరకు బ్యాగులు సిద్ధం చేస్తామని జెసి భరత్ తెలిపారు. మిల్లర్లు కూడా ఈ విషయంలో సానుకూలత వ్యక్తం చేశారన్నారు. ధాన్యం రవాణా విషయమై రైతు స్వంతంగా వాహనాన్ని సమకూర్చుకున్నా, రవాణా శాఖ ద్వారా సమకూర్చినా, ప్యాక్ సొసైటీ ద్వారా రవాణా వాహనాన్ని సమకూరుస్తామన్నారు. జెసి వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డిఎం (సిఎస్) ఆర్.తనూజ, డిఒఒ పి. ప్రసాదరావు, డి సి ఓ ఎమ్. జనార్ధన రెడ్డి, ఆర్‌బికె కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న జెసి తేజ్ భారత్

మహిళలకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిడిపిఒ సిహెచ్ నరసమ్మ అన్నారు. శనివారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళల చట్టాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. గృహహింస, పోక్సో, నిర్భయ, బాల్య వివాహ చట్టం వివరించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి అభిషాలోమ్, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్స్ వై.హిమశ్రీ, ఎ.రాజ్యలక్ష్మి, బి.వరలక్ష్మి, ఎ.అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

6న టెన్నికాయిట్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి- దేవరపల్లి

బాల బాలికల టెన్నికాయిట్ ఎంపికలు ఈ నెల 6న ఉదయం 9 గంటలకు మండలంలోని రామన్నపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు రామ్‌ప్రసాద్, కార్యదర్శులు తిరుమల రావు ప్రకటనలో తెలిపారు. 2008 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని, ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణపై అవగాహన

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం స్థానిక దేవీచౌక్ సెంటర్ సమీపంలోని మూడో సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వైయస్సార్ సంపూర్ణ పోషణపై అవగాహన సదస్సు గోకవరం సెక్టార్ సూపర్‌వైజర్ పి.ఇందిరారాణి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. గర్భిణులు ఎటువంటి ఆహారం తీసుకోవాలి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వరసాల ప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, ఎంపిటిసి తోలేటి రమ్యశ్రీ ప్రసాద్, ఎం.సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. పీడీ జిఎస్.రామ్‌గోపాల్ అధ్యక్షతన మండలవ్యాప్తంగా 2020-2021, 2021-2022 రెండేళ్ల కాలానికి చేసిన పనులపై తనిఖీలు నిర్వహించారు. మండలంలో చేసిన అభివృద్ధి నిధులకు సంబంధించి రూ.30 కోట్ల 30 లక్షల పని వివరాలను పరిశీలించారు. ఈ ఆడిట్లో డిస్టిక్ రిసోర్స్‌పర్సన్స్ బహిరంగ సభలో నేరుగా అభివృద్ధి వివరాలను పీడీకి సమర్పించారు. ఈ ఆడిట్లో భాగంగా ఎదురైన పలు సమస్యలు, ప్లాంటేషన్ తగ్గినా ఫీల్డ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో మస్టర్ మిస్టేక్స్ ఎదురైనా, వేతన దారుడు నష్టపోయినా డిఆర్‌సిల ఆధ్వర్యంలో కొన్ని రికవరీ చేసినట్టు చెప్పారు. మునికూడలి పంచాయతీలో రూ.11,575 ఆన్‌లైన్ తప్పిదం వల్ల సిఆర్‌పికి రికవరీ కట్టించినట్టు చెప్పారు. డిఆర్‌పి జి.ప్రసాద్ అధ్యక్షతన రికవరీ చేసినట్టు చెప్పారు. మండల వ్యాప్తంగా పారదర్శకంగా ఈ ఆడిట్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెజరమేష్, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, చల్లమల్ల సుజీరాజు, గంటా శ్రీను, పెదపాటి రమేష్, ఎస్ఆర్‌పి పి.జగన్నాథం, ఆర్‌పి ఎస్.రాజు, ఎం.రాఘవ, బి.హిమానాయక్, పి.కోటయ్య, డి.బాబూరావు, జి.ప్రసాద్, పిడి సిసి సత్యనారాయణ పాల్గొన్నారు.

దుప్పట్లు, దుస్తుల పంపిణీ

గోపాలపురం : ఆపదలో ఉన్నవారికి మానవతా దక్పథంతో ప్రతి ఒక్కరూ సాయం చేయాలని శామ్యూల్ జాషువా అన్నారు. శనివారం గోపాలపురం రక్షణ సేవా సమితి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన క్రిస్మస్ సందర్భంగా వద్ధులకు దుప్పట్లు, సువార్తికులకు దుస్తులు పంపిణీ చేశారు. గెడ్డం సామ్యూల్ జాషువా మాట్లాడారు. జి.ఎలీషా, ఎన్.ఏసేపు, టి.యేసు రాజు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి సాయం

రాజమహేంద్రవరం సిటీ : రూరల్ నియోజకవర్గం బొమ్మూరు గ్రామానికి చెందిన వైసిపికార్యకర్త మట్టాడి సురేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. శనివారము పార్టీ రూరల్ కో ఆర్డనేటర్ చందన నాగేశ్వర్, వైసిపి నాయకులు సురేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

బిక్కవోలు : కొంకుదురు శెట్టిబలిజీపేటలో శనివారం జిల్లా మహిళా స్థాయీ సంఘం చైర్మన్, జెడ్‌పిటిసి రొంగల పద్మావతి అప్పాజీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి రాజా, ఎంపిటిసి పివి, వైసిపి మండల అధ్యక్షుడు పోతుల ప్రసాద్ రెడ్డి (బుజ్జి), కోదండం బాబి పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

గోకవరం : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి కె.సుధారాణి అన్నారు మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులు సచివాలయ సిబ్బందితో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుధారాణి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఓటు హక్కు ఆవశ్యకతను యువతీ యువకులకు తెలియజేయలన్నారు. సచివాలయ సిబ్బంది వాలంటీర్ల సాయంతో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.

సచివాలయ వ్యవస్థతో సత్వర సేవలు

ప్రజాశక్తి-గోపాలపురం

దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే అన్ని రకాల సేవలను అందించడం అభినందనీయమని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. శనివారం మండలంలోని వాదాలకుంటలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యాలయాలను సర్పంచ్ జొన్నకూటి మణమ్మతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి రూ.79.30 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలూ అందించి సుపరిపాలన అందించేందుకు సచివాలయాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసి కె.లలిత, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దారు రవీంద్రనాథ్, రాజంపాలెం సర్పంచ్ కురుకూరి ధనలక్ష్మి, వైసిపి నాయకులు గెడ అమ్మన బాబు, ఉండవల్లి సోమశేఖర్, జొన్నకూటి శ్రీనివాస్, జొన్నకూటి వెంకట్రావు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వివి.రాఘవరెడ్డి పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలని హమాలీల నిరసన

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్రంలోని 29 బేవరేజ్ డిపోల్లో పని చేస్తున్న హమాలీ కార్మికుల ఎగుమతి కూలి రేట్లు పెంచాలని హమాలీల యూనియన్ చాగల్లు డిపో అధ్యక్షులు చింతలపూడి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినట్టు చెప్పారు. సిగ్మా కంపెనీ వారితో ఎగుమతి రేట్లు ఒప్పందం 2021 అక్టోబర్‌తో పూర్తయిందని దాదాపు 13 నెలలు పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. పెరిగిన రేట్లు నిత్యావసర వస్తువులు కొనలేని స్థితిలో ఉన్నామన్నారు. ఎపిఎస్‌బి యాజమాన్యం స్పందించి కూలి రేట్లు పెంచాలన్నారు. డిసెంబర్ 10వ తేదీ లోపల కూలి రేట్లు పెంచకుంటే రాష్ట్రంలో అన్ని డిపోల్లో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

11న వైద్య ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి-నల్లజర్ల

ఈ నెల 11న రాష్ట్ర వైద్య ఉద్యోగుల మహాసభకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని ఎపి ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లా అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం నల్లజర్ల పిహెచ్‌సిలో నిర్వహించిన వైద్య ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగబోయే రాష్ట్ర సదస్సుకు ప్రతి ఉద్యోగి ఒక సైనికుడిగా తరలి రావాలని, ఈ సదస్సులో రాష్ట్ర వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న, అనేకానేక సమస్యలపై చర్చించి. కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు, అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె. గోవిందరావు మాట్లాడుతూ, విజయవాడలో జరగనున్న మహాసభ ఆత్మగౌరవసభగా అభివర్ణించారు. సమయంతో సంబంధం లేకుండా అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించే వైద్య ఉద్యోగులతో రోజుకు మూడు పూటలా ఫేషియల్ యాప్‌తో బయో మెట్రిక్ వేయిస్తుండటం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో కాపా నాగరాజు, కలిదిండి వెంకట చంద్రశేఖర రాజు, పిహెచ్ఎన్‌కె.ఇందిర, ఎంపిహెచ్ఇఒ పలివెల సత్యం, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

క్రీస్తు బోధనలతో శాంతి

నిడదవోలు : ప్రపంచంలో శాంతి వర్ధిల్లడానికి క్రీస్తు బోధనలు దోహదం చేస్తాయని పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ బి.రవికుమార్ అన్నారు. ఆరుల్లలోని సిరి ఫంక్షన్ హాల్లో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పాస్టర్లకు బహుమతులు నూతన వస్త్రాలు అందజేశారు.

గృహ నిర్మాణాలపై అవగాహన

తాళ్లపూడి : జగనన్న ఇల్లు పథకం కింద పొందిన లబ్ధిదారులంతా గృహ నిర్మాణాలపై అవగాహన పెంచుకుని త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. పెద్దేవంలో ప్రభుత్వం అందించిన లే ఔట్లలో శనివారం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు.

ఆదర్శ నగర్‌లో సమస్యల పరిశీలన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 16వార్డు ఆదర్శ్ నగర్ ప్రాంతంలో వైసిపి రాజమండ్రి రూరల్ కో ఆర్డనేటర్ చందన నాగేశ్వర్ శనివారం పర్యటించారు మున్సిపల్ పార్కును స్థానికులతో కలసి పరిశీలించారు. ఈ పర్యటనలో పార్క్ పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, ఆకతాయిలు బెడద ఎక్కువగా ఉందని చందన నాగేశ్వర్‌కు స్థానికులు వివారించారు. చందన నాగేశ్వర్ దీనిపై స్పందిస్తూ మున్సిపల్ అధికారుల దృష్టికి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆకతాయిల బెడదపై రాత్రి పూట పోలీస్ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్టూ'నిజం'



అలాగే.. మనకి ఓటు పవరుంది..

రేపు. మనం కూడా ఏదైనా చేయొచ్చు..!!

ఘనంగా వికలాంగుల దినోత్సవం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం శనివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

బిక్కవోలు భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య ఎఎంసి ఛైర్మన్ జెవివి.సుబ్బారెడ్డి మాట్లాడారు. అనంతరం వీల్‌చైర్స్, ట్రైసైకిళ్లను అందజేశారు. తొలుత బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పోసిబాబు, వైస్ ఎంపిపి కన్నారావు, కార్యాలయ పర్యవేక్షకులు వి.డి.రత్నకుమార్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పైడిరాజు, ఉపాధ్యాయులు సన్యాసిరావు, శివబాబు, రమాదేవి, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మంగరాజు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** ప్రతిభ కనబరచడానికి అంగవైకల్యం అడ్డు కాదని కొవ్వూరు అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ పేర్కొన్నారు. కొవ్వూరు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వెంకటేష్, పివిపి.లక్ష్మి, వై.ప్రకాశ్‌రావు, విఆర్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పెరవలి మండలంలోని కానూరు భవిత పాఠశాలలో ఎంఇఒ వెలగల హైమావతి మాట్లాడారు. వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్ అందజేశారు. ఉపాధ్యాయుని ఎం.శిరీష, ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్, మేక పార్వతి, సత్య వరలక్ష్మి పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షుతన నిర్వహించిన వేడుకల్లో వీల్‌ఛైర్స్ అందజేశారు. గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాస్ మాట్లాడారు. **గోపాలపురం** భవిత కేంద్రంలో, వెంకటాయపాలెం పాఠశాలలో ఎంఇఒ జి.శ్రీనివాసరావు శ్రీనివాసరావు, హెచ్‌ఎం కోన జయరామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సనపల రాజశేఖర్, వి.పద్మావతి, బి.మంగరాజు, సిఆర్‌పి నాగరాజు, హేమ, షేక్ షారూఖ్ ఖాన్ పాల్గొన్నారు. **కడియం** భవిత కేంద్రంలో వైసిపి రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరజాల బాబు, ఎంఇఒ వి.లజపతిరాయ్, బట్టు చిన్ని, సాకా పట్టాభి, నాగిరెడ్డి వీర శివాజీ పాల్గొన్నారు. పిడింగొయ్యి గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలు కొల్లేటి వెంకటలక్ష్మికి మనం ట్రస్ట్ ద్వారా రూ.15 వేలు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు నరమామిడి రామ దుర్గప్రసాద్, సుజాత దంపతులు తమ కుమారుడు జస్వంత్ నాగ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ నగదు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వీరు, దుర్గేష్, స్వప్న, విజయ్, తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొని మాట్లాడారు. బాలబాలికలకు దుప్పట్లు , పండ్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ఎంఇఒ పివిఎస్ నాగరాజు పాల్గొన్నారు.



బిక్కవోలులో వీల్‌చైర్స్ పంపిణీ

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

జగనన్న గృహ లబ్ధిదారులు అందరూ సత్వరం ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. శనివారం హౌసింగ్ డేను పురస్కరించుకుని చివటం హైస్కూల్ వద్ద అందచేసిన జగనన్న ఇళ్ల స్థలాలను ఆమె పరిశీలించారు. తొలుత ఒక లబ్ధిదారుని స్థలంలో మొక్క నాటి, అనంతరం ఒక లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులకు పలు సూచనలు అందించారు. అత్యంత విలువైన భూములను పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు. నిర్మాణానికి అవసరమైన సామాగ్రి తోపాటు, డ్వాక్రాల ద్వారా ఆర్థిక సహాయం కూడా అందజేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, గ్రామ సర్పంచ్ ఈడ్పుగంట సత్యనారాయణ, ఎంపిటిసి వేముల సత్యనారాయణ, తహశీల్దారు జి.కనకరాజు, ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్, ముత్యం వీరాస్వామి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ముమ్మడి కుమారి



ఓటర్ల నమోదు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రమణ

ఓటర్ల నమోదు శిబిరాల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడరూరల్

ఇంద్రపాలెంలోని జడ్‌పి హైస్కూల్, ఎంపిపి హైస్కూల్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాన్ని శనివారం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి కాకినాడ ఆర్‌డిఓ. బివి రమణ పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. 18 ఏళ్ళ నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా, 17 ఏళ్ళ నిండిన వారు కూడా ముందస్తుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. దివ్యాంగులు, లింగమార్పిడి చేసుకున్న వారికి కూడా ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఫాం 6 ద్వారా నూతన ఓటర్ల నమోదు, ఫాం 6బి, ఫాం 7, ఫాం 8 ద్వారా ఓటరు జాబితా వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి కొత్త ఓటర్ల పేర్లు, వివరాలతో జాబితా తయారు చేయాలన్నారు. మరణించిన వారి వివరాలు సేకరించి, జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్ల మార్పు చేర్పు బదిలీ వంటి అంశాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట విఆర్‌ఒ. కె.వి రామకృష్ణారెడ్డి ఉన్నారు.



ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ కార్పొరేషన్ కమిషనర్, ఇఆర్‌ఒ కె.రమేష్ శనివారం నగరం లోని ఓటర్ల నమోదు శిబిరాలకు వెళ్ళి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. రెండు రోజులపాటు జరిగే ప్రత్యేక శిబిరాల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు తీరును సమీక్షించారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ఉదయం 10 నుంచి 5 గంటలలోపు నిర్ణీత దరఖాస్తులను పూర్తి చేసి అందుబాటులో ఉన్న బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని కమిషనర్ రమేష్ కోరారు.

యువజన ఓటర్లుగా నమోదు కావాలి

వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కోరారు. శనివారం ఆయన పీఆర్, ఐడియల్ కళాశాలల్లో కొత్త ఓట్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఇందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని కమిషనర్ కోరారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలోఎన్ఎస్ఎస్ విభాగం, రోటరాక్ట్ క్లబ్ సంయుక్త నిర్వహణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ డి శారదా దేవి, కాకినాడ జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ యూనిట్ ఇన్‌ఛార్జ్ పర్యవేక్షణలో వైద్య బృందం సుమారు 100 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం 73 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నుండి రక్తమునుసేకరించి కాకినాడ గవర్నమెంట్ హస్పటల్‌కు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎం వి హరనాథ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరెక్టర్ డా ఎస్ శంభుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జి నరేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరు, వి. రాజశేఖర ఫణీంద్ర, ఈవెంట్ కో- ఆర్డినేటర్స్, వై విజయ కుమార్ వై శివ తేజ సౌర్యలు డిపార్ట్మెంట్ ఎన్ ఎస్ఎస్ ఇన్చార్జీలు, విద్యార్థుల తరుపున కో-ఆర్డినేటర్స్ ఆర్ బాల సాయి సుందర్, శ్రీరామ్ దీపక్ పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో కాకినాడలోని జె,.ఎన్.టి.యు.కె పరిధిలోని అంతర్ కళాశాలల"అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ - 2022-2023" పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఓవర్ ఆల్ ఛాంపియన్‌గా పురుషులు, మహిళా విభాగాలలో వైజాగ్ విజ్ఞాన్ జట్లు గెలుపొందాయి. మెన్ ఇండివిద్యువల్ శ్రీ వర్ధన్, (విజ్ఞాన్ వైజాగ్), విమెన్ ఇండివిద్యువల్ డి.కావ్య (విజ్ఞాన్ వైజాగ్) గెలుపొందారు. ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. మురళీమోహన్ అథ్లెటిక్స్ విభాగంలో వివిధ పోటీలలో విజేతల వివరాలను ప్రకటించారు. ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, జె.ఎన్.టి.యు.కె అంతర్ కళాశాలల అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ. జి.పి.రాజు విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

ఆదిత్యలో విజ్ఞానదాయకంగా కార్యశాల

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఒకరోజు నిర్వహించిన కార్యశాలలో బెంగళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ తాళాబత్తుల శ్రీనివాస్ ఫోటోనిక్స్ ఆధారిత క్వాంటమ్ ఇన్ఫోర్మేషన్ టెక్నాలజీ అనే అంశంపై వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డోలా సంజయ్.ఎస్, విభాగాధిపతులుదన్నిన కిషోర్, రాయుడు విజయకృష్ణ మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ రంగంలో ఫోటోనిక్స్ టెక్నాలజీ ఆవస్యకతను వివరించారు. కళాశాల డీన్ ఎ.రామకష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆవేదన...ఆందోళన

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రహసనంలా మారింది. గత కొన్నేళ్లుగా ఎదురౌతున్న ఇబ్బందులే మళ్లీ పునరావృతం అయ్యాయి. నూతన సాంకేతిక విధానంతో రైతు భరోసా కేంద్రాలలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని అధికార యంత్రాంగం ప్రకటనలు గుప్పించిన విషయం విదితమే. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 80 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. అధికారులు తీసుకొన్న కొనుగోలు లక్ష్యంలో కనీసం 40 శాతానికి కూడా చేరుకోలేదు. అవరాలకు తగ్గట్లుగా గన్నీ సంచులు అందుబాటులో లేకపోవటంతో గోకవరం మండలంలో రైతులు ఆందోళనలుచేపట్టడం ఒక ఉదాహరణగా చెప్పొచు. అదే విధంగా తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో రైతుల ధాన్యం కొనుగోలులో తాత్సార్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు రోజుల తరబడి రోడ్ల వెంబటి ఆరబెట్టాల్సి వస్తుంది. ఆర బెట్టేందుకు వినియోగించే బరకాలకు రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. అప్పటికీ విసిగిపోయిన రైతన్న తక్కువ ధరకు దళారులకు విక్రయించక తప్పడం లేదు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని లేదా తేమ శాతం నిబంధనలను సడలించాలని అధికారులను రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

టిడిపిలో గ్రూపుల పోరు

తెలుగుదేశం పార్టీలో గ్రూపుల పోరు మరో సారి బహిర్గతమైంది. ప్రతిపక్ష నేత, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మరో సారి బహిర్గతం అయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో చంద్రబాబు అధికార పార్టీపై నిప్పులు చెరిగారు. సైకోలు, శాడిస్ట్‌పాలన అంటూ తీవ్రమైన విమర్శలు గుప్పించారు. అయితే తమ పార్టీ శ్రేణుల తీరుపైనా మండిపడ్డారు. కొవ్వూరులోనిర్వహించిన సభలో అతి తక్కువ మంది హాజరయ్యారు. ఆ పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమని రామకృష్ణ పూర్తి స్థాయిలో కార్యకర్తలను సమీకరించలేక పోయారనే విమర్శలు వచ్చాయి.

ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జవహర్ చొరవ లేకపోవటంతో కూడా ప్రధాన కారణంగా తెలుస్తోంది. కార్యక్రమం ప్రారంభంలో ద్విసభ్య కమిటీ సభ్యుల ఫొటోలను వారి అనుచరులు ప్రదర్శించటంతో చంద్రబాబు చుకలు అంటించారు. తన ముందు ఫొటోలు ప్రదర్శిస్తే ఫలతం లేదని ప్రజల్లో పని చేయాలని తేల్చి చెప్పటంతో ఆ పార్టీ శ్రేణులు ఖంగుతిన్నారు. నిడదవోలులో అ పార్టీ నాయకులు కుందుల సత్యనారాయణ జన సమీకరణలో కీలకంగా పనిచేసినప్పటికీ ఆయన చరులుచేసిన హడావుడిపై చంద్రబాబు మండిపడ్డారు. పార్టీ క్రమశిక్షణకు మారుపేరని గుర్తు చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని ప్రకటిస్తామని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు చొరవ పూర్తి స్థాయిలో లేదని అక్కడి ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

భూ సర్వేతో కొత్త సమస్యలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన భూ సర్వే కార్యక్రమం కొత్త సమస్యలను తెచ్చిపెడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికార యంత్రాంగం పర్యవేక్షణ, క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన లేమి ప్రధాన కారణాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు 100 సంవత్సతరాల క్రితం భూ రికార్డులు నమోదు చేశారు. ఇప్పటికీ ఆ సర్వే నెంబర్ల ఆధారంగానే క్రయ విక్రయాలు, ఆస్థిపంపకాలు తదితర లావాదేవీలు జరుగుతున్నాయి. గత కొన్నేళ్లుగా భూ వివాదాలు నిత్యకృత్యంగా మారాయి. ప్రతి గ్రామంలోనూ ఈ దుస్థితి తలెత్తుతోంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నూతన సాంకేతిక విధానంతో డ్రోన్‌లను వినియోగించి ప్రభుత్వం భూ సర్వే నిర్వహిస్తున్నామని చెబుతోంది. అయితే ఇప్పటి వరకూ అధికారులు చేపట్టిన మండలాల్లో సర్వేపై రైతులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూముల విస్తీర్ణంలో కొందరికి ఎక్కువ, మరికొందరికి తక్కువ రావటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పాస్‌పుస్తకాలపై ముఖ్యమంత్రి ఫొటోను ముద్రించటం విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి సమాచారంతో భూ సర్వే పూర్తి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కంటితుడుపుగా విద్యా దీవెన

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విద్యా దీవెనపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏడాది ఆలస్యంగా నిధులు విడుదల చేయటమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. కాలేజీల యాజమాన్యాలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసే పరస్థితి లేదు. దీంతో అప్పులు చేసి విద్యార్థుల ఫీజులు చెల్లిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. అదే విధంగా పాఠశాల విద్యార్థులకు ఎఫ్ఎ-2 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. ఉపాధ్యాయుల వాట్సప్‌లకు ప్రశ్నాపత్రం పంపించడంతో ఉపాధ్యాయులు బోర్డుపై రాయాల్సి వస్తోంది. విద్యార్థులు జవాబులతో పాటు ప్రశ్నలను రాసేదుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత విధానాలపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

నేడు యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- తాళ్ళరేవు

యుటిఎఫ్ తాళ్ళరేవు మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి ఎస్. మురళీ కృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎం.తాతారావు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఎంఎల్‌సిలు ఐ. వెంకటేశ్వరరావు, షేక్ బాబ్జి, మండల ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులంతా సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దిశ యాప్‌తో రక్షణ

ప్రజాశక్తి - గోపాలపురం

ఆపదలో ఉన్నవారు దిశ యాప్‌తో రక్షణ పొందవచ్చని సిడిపిఓ వై.బి.టి సుందరి విద్యార్థులకు సూచించారు. శనివారం వాదాలకుంట జడ్‌పి హైస్కూల్‌లో సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో సిడిపిఓ.వైబిటి సుందరి మాట్లాడుతూ గృహ హింస, వరకట్నం వేధింపులపై, యాసిడ్ దాడులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లింగ వివక్షత ఉండకూడదని ఆడ మగ ఇద్దరు సమానమేనని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్ కుమార్, మోహనరావు, సూపర్వైజర్ కె.సుశీల, జేవి రమణ, వెంకటలక్ష్మి , కుమారి పాల్గొన్నారు.

కొండపోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గత 25 సంవత్సరాల పైగా సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గిరిజనులు ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సిపిఐ (ఎం ఎల్) వినోద్ మిశ్రా కార్యదర్శి కోసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ రమణయ్యపేట గిరిజనుల సాగులో ఉన్న సర్వే నెంబరు 83 లోని కొండపోడు భూమిని 35 కుటుంబాలు సాగు చేసుకుంటున్నారు. వారికి ఎటువంటి పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలకు దూరమవుతున్నారంటూ తహశీల్దార్ ఏ విశ్వనాథ శాస్త్రికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నువ్వా నూకాలమ్మ సోమాల మంగ, పిట్టం సూర్యావతి మరువాడ లక్ష్మి, నంబారి నాగమణి, మైలపల్లి అచ్చుమ్మ, మరువాడ బాపునమ్మ తదితరులున్నారు.

శృంగార వల్లభ స్వామి ఆలయానికి రూ.1,71,616 ఆదాయం

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతి శంగార వల్లభ స్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. శనివారం ఒకరోజు హుండీల ద్వారా రూ. 1,30,430, అన్నదానం విరాళాల ద్వారా రూ.41,186 ఆదాయం సమకూరింద న్నారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం,మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకులు, ఆలయ సిబ్బంది కష్ణ, మోహన్ రావు, సత్య నారాయణ, అంజనీ కుమార్ తదితరులు సేవలందించారన్నారు.

ఎంఎల్ఏ చంటిబాబు పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

ఇటీవల కూలి పని నిమిత్తం దివాన్ చెరువు వెళ్లి ప్రమాదవశాత్తు మతి చెందిన వెలిది సూరిబాబు కుటుంబ సభ్యులను శనివారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పరామర్శించారు. మతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఆయన వెంట ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఉపసర్పంచ్‌లు దొమ్మా శ్రీను, బండారు రాజా ఉన్నారు.

ప్రణాళికాయుతంగా సమగ్ర భూ సర్వే

-ప్రత్యేకంగా రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ల నియామకం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు ప్రతిష్టాత్మక సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ప్రణాళికాయుతంగా వేగవంతం చేసేందుకు, నిర్వహించేందుకు కృషిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా కతికా శుక్లా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ విధానగౌతమి సమావేశ మందిరంలో శనివారం కాకినాడ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, విఆర్‌ఒలకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూసర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, కాకినాడ ఆర్‌డిఒ బీవీ రమణ, సర్వే ఏడీ బి.లక్ష్మీ నారాయణలతో కలిసి హాజరయ్యారు. మొదటి దశలో కాకినాడ డివిజన్ పరిధిలో 121 గ్రామాలకు సంబంధించి సమగ్ర భూసర్వే రికార్డుల రూపకల్పనను విజయవంతంగా పూర్తిచేసిన రెవెన్యూ, సర్వే అధికారులను కలెక్టర్ అభినందిం చారు. రీ సర్వే కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన డిప్యూటీ తహశీల్దార్లు నెలలో 15 రోజులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించాల న్నారు. అప్పీళ్లను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాల న్నారు. ఇకపై ప్రతి నెలలో మొదటి వారం శిక్షణ నిర్వహించనున్నామని వివిధ సమస్యల పరిష్కారానికి, కొత్త అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయ న్నారు. భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తయిన చోట స్టోన్ ప్లాంటేషన్‌కు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. సర్వేకు ముందు, సర్వే సమయంలో, ఆ తర్వాత ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా, సమన్వయంతో పని చేయాలన్నారు. రైతుల నుంచి ఏ ఫిర్యాదు అందినా క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.



జగనన్న శాశ్వత భూ హక్కు, భూసర్వే శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా



కల్యాణమండపం ప్రారంభోత్సవం చేస్తున్న రాజబ్బాయి

కల్యాణ మండపం పునఃప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గౌరీ కోనేరు సెంటర్‌లో శ్రీ ముప్పన రామారావు కమ్యూనిటీ హాల్ లో రూ.20 లక్షల కమ్యూనిటీ భవన నిధులతో ఆధునీకీకరించిన బచ్చు గురుమూర్తి, నాగరత్నం కళ్యాణ వేదికను శనివారం కమ్యూనిటీ భవన కమిటీ అధ్యక్షులు జెట్టి వీర వెంకట సత్యం(రాజబ్బాయి), వీర్రాజు కుమారి దంపతులు ప్రారం భించారు. కార్యదర్శి తూతిక రాజు, ఉపాధ్యక్షులు జట్ల సత్యానారాయణ, ఎర్రా ఆదినారాయణ,బచ్చు గురు ప్రసాద్,దోర నాగేశ్వర రావు, అల్లాడ మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థిని సత్కరిస్తున్న అధ్యాపకులు

పూర్వ విద్యార్థినికి సత్కారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ ప్రభుత్వ కళాశాలలో సీటు పొందిన పూర్వ విద్యార్థిని దేవరకొండ అపర్ణ నాగదేవిని శనివారం సత్కరించారు. కళాశాల ఇన్చార్జ్ హెచ్ఎం వెన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన మెడికల్ కళాశాలల ప్రవేశ పరీక్ష నీట్ లో మంచి ర్యాంకు సాధించి కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో అపర్ణ ప్రవేశం పొందడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మువ్వల లోవప్రసాద్, వనమా శ్రీరామ్, ఎం చిన్నబాబు, ఎ.సువర్ణ దొర, ఎన్ మంజుల, జే ప్రతిభ, డి భవాని తదితరులున్నారు.



విద్యార్థులకు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి, చైర్మన్ రమాదేవి

విద్యార్థినులకు పుస్తకాల పంపిణీ

కరప - ప్రజాశక్తి

వాకాడ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పులి రాంబాబు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన శ్రీ వెంకట భాస్కర రామ ట్రస్టు ద్వారా కరప నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు 18 మందికి పాఠ్య పుస్తకాలను సమకూర్చారు. వీటినిగ్రామ సర్పంచ్ సాదే ఆశా జ్యోతి లోహిదాస్, స్కూల్ చైర్మన్ శ్రీపాదం రమాదేవి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లీలా మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొమరగిరి లేఅవుట్‌పై మాట్లాడుతున్నకమిషనర్ రమేష్

కొమరగిరి లే అవుట్ పరిశీలన

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ప్రతి శనివారం నిర్వహిస్తున్న హౌసింగ్-డేలో భాగంగా నగరపాలక సంస్థ, గృహ నిర్మాణ శాఖ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ కె.రమేష్ కొమరగిరిలో గృహ నిర్మాణ ప్రగతిని, కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న కొంతమంది లబ్ధిదారులకు డిసెంబర్ చివరి నాటికి ఇళ్లు అప్పగించే ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, కాకినాడ నగరపాలక సంస్థఎస్ ఈ పి.సత్యకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - ఆలమూరు



సాయం అందజేస్తున్న పాపారావు

మండల కేంద్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వెలవలపల్లి సుబ్రహ్మణ్యం భార్య, కోడలు అనారోగ్యంతో ఇటీవల నాలుగు రోజుల వ్యవధిలో మృతి చెందారు. దీంతో వారి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. దీంతో స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త, మురళీకష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి రూ. 25 వేల రూపాయల నగదు, 50 కేజీల బియ్యాన్ని పాపారావు అందజేశారు.

ఎలక్ట్రీషియన్ శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అయినవిల్లి



సాయం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

చింతల్లంక గ్రామానికి చెందన పెనుమాల శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్ పని చేస్తు అనారోగ్యంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. యూనియన్ సభ్యునిగా ఉన్న ఆయనకు వరసిద్ధి వినాయక ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ముక్తేశ్వరం వారి ఆధ్వర్యం రూ. 5వేలు సాయం అందించారు కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్ యూనియన్ అధ్యక్షులు డి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎంవివిడి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -మండపేట

భారతదేశ తొలి రాష్ట్రపతి, రాజ్యాంగ ముసాయిదా తయారీ సంఘ అధ్యక్షుడు, భారత రత్న డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతి స్థానిక సంగమేశ్వర కాలనీలోని ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు.రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఓటు హక్కుపై అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ఓటు హక్కుపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. పలుచోట్ల అధికారులు పాల్గొని విద్యార్థులకు ఓటు హక్కు విశిష్టతను వివరించారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి

మామిడికుదురు ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని గుర్తించి అర్హులంతా ఓటు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులతో శనివారం మాట్లాడారు. కళాశాలలో కొత్త గా ఓటు హక్కు నమోదు చేయించుకునే శిబిరాన్ని ఆయన సందర్శించారు. తర్వాత విద్యార్థులతో మాట్లాడారు. ఒక వ్యవస్థకు ప్రజా ప్రతినిధి ఎంత అవసరమో, ఆ ప్రజా ప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు అంతే అవసరమని వివరించారు.



కొత్తపేట శతాబ్ది కళాశాల్లో అవగాహన సదస్సు

అంతకుముందు కళాశాల సెమినార్ హాల్లో ప్రిన్సిపల్ డి.వి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో తహశీల్దార్ సీహెచ్.నాగలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే పౌరులు తమ బాధ్యత గురించి తెలుసుకోవాలి. ఈ కార్యక్రమంలో డిటి కె.శరణ్య, రెవిన్యూ అధికారులు అలీ, జి.వెంకటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, అధ్యాపకులు మోకా రంగారావు, కోడూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** రాజ్యాంగం కల్పించిన ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం ద్వారా బంగారు భవిష్యత్తు నిర్మించుకోవచ్చునని కొత్తపేట తహశీల్దార్ జిడి.కిషోర్ బాబు అన్నారు. స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాల్లో శనివారం ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కట్టా నాగ మోహన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి ఎన్.బి.విజయలక్ష్మి, ఎలక్షన్ డిటి అజ్జమ్మ, ఆర్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి కోరారు. ఎస్-ఎస్ఆర్-2023 ఫొటో ఓటరు గుర్తింపు జాబితాపై శనివారం మండలంలో బిఎల్ఒ లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎలక్షన్ కమిషన్ ఓటర్ల జాబితాకు ఆధార్ తో అనుసంధానం ఫారం 6బి ప్రక్రియను డోర్ టు డోర్ తనిఖీ చేసి ఓటరు కార్డుకు అనుసంధానం చేయాలన్నారు. ఈ సందర్భంగా గొల్లవిల్లి సిఎస్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆ కళాశాలలో ప్రిన్సిపల్ కె.బాలాజీ అధ్యక్షతన అవగాహన సదస్సును తహశీల్దార్ వెంకటేశ్వరి నిర్వహించారు. **ఆలమూరు** ప్రతి ఒక్కరు ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ జి.లక్ష్మీపతి అన్నారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఆయా ప్రిన్సిపల్స్ అధ్యక్షతన అవగాహన సదస్సు విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామ్ 6 ద్వారా నూతన ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ నరసింహ స్వామి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రామాయమ్మ, విఆర్‌ఒ సత్యప్రసాద్, ఎలక్షన్ ఆపరేటర్ మల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మామిడికుదురు దీప్తి కళాశాల్లో అవగాహన సదస్సులో కలెక్టర్

లింగ వివక్షను రూపుమాపాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం

లింగ వివక్షను రూపుమాపాలని, లింగ వివక్షకు ముగింపు పలకాలని, సమ సమాజానికి అందరూ పాటుపడాలని పామర్రు గ్రామ సర్పంచ్ వాసంశెట్టి వెంకట దుర్గా సూరిబాబు పిలుపునిచ్చారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా పామర్రు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కిషోర్ బాధితులు అంగన్‌వాడీ టీచర్లు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

6 న అవగాహనా సదస్సు

రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల6న మహిళా వివక్ష పై అవగాహన సదస్సు నిర్విస్తున్నట్లు ఎంపిడిఒ కీర్తి స్పందన శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన సదస్సు జరుగు తుంది అన్నారు. వివరించారు. అవగాహన సదస్సు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని అదేరోజు 11 గంలకు జిపిడిపి యాక్షన్ ప్లాన్ అమలుపై సమావేశం లో చర్చిస్తామన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు. ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



పామర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం